ఆంధ్రజ్యోతి
andhrajyothy.com


మద్యం దరఖాస్తులకు నేడు చివరి రోజు

నిర్మల్ రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 47 మద్యం దుకాణాలకు శనివారం చివరితేదీ అని జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి అబ్దుల్ రజాక్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఎస్‌బీఐ బ్రాంచ్ ప్రత్యేకౌంటర్ కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత పాలసీలో చివరి తేదీన 701 దరఖాస్తులు వచ్చాయని, ఈసారి ఆ సంఖ్య మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం ఒక్కరోజు 160 దరఖాస్తులు వచ్చాయని, ఇప్పటివరకు మొత్తం 306 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు.

నిర్మల్ నుంచి కాశీ - అయోధ్యకు బస్సు

నిర్మల్ రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ నిర్మల్ డిపో నుంచి ప్రయాగ్ రాజ్ త్రివేణి సంగమం, కాశీ (వారణాసి)అయోధ్యకు ఈ నెల 27వ తేదీ సోమవారం నుంచి బస్సు ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ కే.పండరి తెలిపారు. 27వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు నిర్మల్ నుంచి బయలుదేరి, తెల్లవారు 28వ తేదీన ప్రయాగ్‌రాజ్, మధ్యాహ్నం 2 గంటలకు కాశీకి చేరుకుంటుందన్నారు. ఆ రోజు రాత్రి కాశీలోనే బస్సు ఉంటుందన్నారు. భక్తులు కాశీ విశ్వనాథ టెంపుల్, విశాలక్షి టెంపుల్, అన్నపూర్ణ టెంపుల్, గంగాహారతి అన్ని ఘాట్‌లు దర్శించుకున్న తర్వాత 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు అయోధ్యకు చేరుకుంటుందన్నారు. అదే రోజు రాత్రి అయోధ్య నుంచి బయలుదేరి 30వ తేదీ రాత్రి నిర్మల్ చేరుకుంటుందన్నారు. ఒకరికి రూ. 6,400 ఉంటుందని, భోజనవసతి ఖర్చులు ప్రయాణికులే భరించాలని, బుకింగ్ కోసం నిర్మల్ బస్టాండ్‌లో కాని, అధికారిక వెబ్‌సైట్ సర్వీస్ నెంబర్ 99999లో కాని టికెట్ బుక్ చేసుకోవాలన్నారు. 9959226003, 8328021517, 7382842582లో సంప్రదించాలన్నారు.

కోతుల పంజా!

- వరుసదాడులతో బెంబేలెత్తుతున్న జనం
- పంటలపైనా దాడులు
- తల్లడిల్లుతున్న రైతులు
- ఆందోళనబాటలో ప్రజలు

నిర్మల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంతో పాటు భైంసా, ఖానాపూర్ పట్టణాల్లోనే కాకుండా చాలా గ్రామాల్లో కోతులతో జనం తీవ్రఇబ్బందుల పాలవుతున్నారు. కోతులు వెంటాడుతూ దాడులు జరిపిన సంఘటనలతో ఇప్పటికే పలువురు మృతిచెందగా వందల మంది గాయాలపాలయ్యారు. ప్రస్తుతం ఇక్కడి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో ప్రతిరోజూ 30 నుంచి 50 మందికి పైగా కోతుల దాడుల కారణంగా గాయపడి చికిత్సల కోసం వస్తున్నారు. దీనిని బట్టి ఇక్కడ పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలిసిపోతోంది. ముఖ్యంగా గత ఐదారునెలల నుంచి కోతుల గుంపుల సంఖ్య విపరీతంగా పెరిగిపోవడం జనాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. ఇక్కడి జనం కర్ర లేకుండా అడుగు బయటకు వెళ్ళేలేని పరిస్థితి నెలకొంది. కోతుల గుంపుల కారణంగా రోడ్డుపై నడిచేందుకు జనం భయభ్రాంతులకు గురవుతున్నారు.

దాడులతో జనం బెంబేలు...

గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుండా పట్టణ ప్రాంతాల్లోని గల్లీలలో కోతుల బీభత్సం కొనసాగుతోంది. వీధులన్నింటినీ కోతులు హైజాక్ చేసి గంటల తరబడి హంగామా సృష్టిస్తున్నాయి. గల్లీలలో కోతుల గుంపులన్నీ భారీసంఖ్యలో గలాటా చేస్తున్న కారణంగా జనం ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేక అవస్థల పాలవుతున్నా రు. చేతిలో కర్ర లేకుండా ఒక గల్లీ నుంచి ఇంకో గల్లీకి దాటి వెళ్లలేని పరిస్థితి ఉంది.



ఒకవేళ ఎవరైనా కోతిని బెదిరిస్తే పదుల సంఖ్యలో కోతుల గుంపులు వచ్చి ఎదురు దాడి చేస్తున్నాయి. ఇప్పటికే చాలా మంది మున్సిపల్ అధికారులకు ఫారెస్ట్ అధికారుల కు కోతుల విషయంలో ఫిర్యాదు చేసినప్పటికీ ఎవరూ చర్యలు తీసుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లల్లోకి చొరబడుతున్న కోతులు అక్కడి పం టచేలను సైతం నాశనం చేస్తున్నాయని అంటున్నా రు. గుంపులు గుంపులుగా పంటలపై దాడులు చేస్తుండడంతో రైతులు రాత్రింబవళ్లు వాటిని అడ్డుకునేందుకు కాపలా కాస్తున్నారు. పంటలను కోతుల నుంచి రక్షించుకోవడం రైతులకు, వా టి నుంచి ప్రాణాలను కాపాడుకోవడం ప్రజలకు ప్రాణసంకటంగా మారుతోంది. అధికారులు కోతుల నుంచి జనా న్ని, రైతులను కాపాడేందు కోసం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. కోతుల నుంచి రక్షించే విషయంలో సంబంధిత మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. పట్టణ , గ్రామీణ ప్రాంతాల్లోని కోతులను మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు పట్టుకొని నిర్మల్‌లోని కోతుల పునరావాస కేంద్రానికి తరలించాల్సి ఉంది. అయితే కోతులు పట్టే వ్యవహారం ఖరీదుగా మారిపోవడమే కాకుండా కోతులు పట్టేవారు కూడా అందుబాటులో లేకపోతుండడం సమస్యను మరింత జటిలం చేస్తుందంటున్నారు. మున్సిపాలిటీలు గ్రామ పంచాయతీలలో కోతులను పట్టుకునేందుకు ఎలాంటి బడ్జెట్ లేకపోవడం ఓ సమస్యగా మారిందంటున్నారు. కొద్ది రోజుల క్రి తం ఇక్కడి చించోలి వద్ద గల కోతుల పునరావాస కేంద్రానికి సిద్దిపేట, నర్సాపూర్ మున్సిపాలిటీల నుంచి దాదాపు 500ల కోతులను కుటుంబనియంత్రణ ఆపరేషన్ కోసం తీసుకువచ్చినట్లు ఇక్కడి పశువైద్యాధికారి తెలిపారు. అయితే నిర్మ ల్ జిల్లా నుంచి మాత్రం ఆశించిన రీతిలో పునరావాస కేంద్రానికి కోతులను స్టెరిలైజేషన్ కోసం తీసుకురాకపోతుండడం విమర్శలకు తావిస్తోంది. కాగా జిల్లా కేంద్రంలో పెరిగిపోతున్న కోతుల బీభత్సం నుంచి తమను రక్షించాలని కోరుతూ స్థానికులు ఇప్పటికే అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. వారం రోజుల తరువాత నిర్మల్ జిల్లా కేంద్రంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. పలు వీధి సంఘాలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంఘాలు నిరసన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టబోతున్నారు. ఇప్పటికే కార్యచరణ రూపొందించేందుకు సమావేశమవ్వడం విశేషం.

ప్రజాసేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చా

● ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

ముథోల్/బాసర అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ నియోజకవర్గ ప్రజలకు సేవచేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. ముథోల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ మొత్తం 88 చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న మిగతా చెక్కులను త్వరలో లబ్ధిదారులకు అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆనంద్ రావు పటేల్, తహసీల్దార్ శ్రీలత, నాయబ్ తహసీల్దార్ తెలంగ్ రావు, ఆర్‌ఐ నారాయణ రావు పటేల్, బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న, నాయకులు గంట శ్రీనివాస్, నిమ్మ పోతన్న, దత్తాద్రి, సప్పటోల్ల పోతన్న, సతీష్ రెడ్డి, టి. రమేష్, లక్ష్మీ నారాయణ, జీవన్, మోహన్ యాదవ్ పాల్గొన్నారు.

●**బాసర :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మీ షాదీముబారక్ పథకాలు నిరుపేద కుటుంబాలకు ఆర్థికభరోసాను కల్పిస్తున్నామని ముథోల్ నియోజకవర్గ ఎమ్మెల్యే రామరావుపటేల్ పేర్కొన్నారు. శుక్రవారం బాసర మండల కేంద్రంలోని రైతువేదిక కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే రామారావుపటటేల్ చేతుల మీదుగా పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్యాణలక్ష్మీ, షాదీదిముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు వరంలా మారాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ పథకాలను అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రభుత్వ ధ్యేయం., ఎవరు కూడా ఇబ్బంది పడకుండా, ఎలాంటి దళారుల ప్రమేయం లేకుండా పాదర్శకంగా నేరుగా లబ్ధిదారులకే చెక్కులను పంపిణీ చేస్తున్నామని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాల విషయంలో అర్హులైన ఏ ఒక్కరికి కూడా అన్యాయం జరగకుండా చూస్తామని, ప్రజలు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలోతహసీల్దార్ పవన్‌చంద్ర, బీజేపీ మండల అధ్యక్షులు సాయినాథ్‌పటేల్, మాజీ సర్పంచ్‌లు సతీష్‌రావు, రమేష్ స్థానిక నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



ముథోల్‌లో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

బీసీ రిజర్వేషన్ బిల్లుపై బీజేపీకి చిత్తశుద్ధి లేదు

- కాంగ్రెస్‌తోనే బీసీలకు న్యాయం
- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

నర్సాపూర్(జి), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్ బిల్లు విషయంలో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఏమాత్రం చిత్తశుద్ధి లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. శుక్రవారం నర్సాపూర్(జి) మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీల హక్కుల కోసం పిలుపునిచ్చిన శనివారం బీసీ బంద్‌కు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ... ఏఐసీసీ అగ్ర నేత రాహుల్‌గాంధీ భారత్ జోడోయాత్ర సందర్భంగానే దేశంలో కుల గణన జరగాలని బలంగా కోరుతున్నారని గుర్తుచేశారు. అయి తే ఈ బిల్లులకు కేం ద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డు పడుతూ తిరిగి కాంగ్రెస్ పార్టీపైనే బురదజల్లే ప్రయ త్నం చేస్తోందని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్ బిల్లు విషయంలో నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ఇప్పటి వరకు ఎందుకు మాట్లాడలేదని శ్రీహరిరావు ప్రశ్నించారు. సమావేశంలో ముథోల్ మాజీఎమ్మెల్యే నారాయణ రావు పటేల్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అర్జుమంద్ అలీ, నిర్మల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సోమ భీమ్‌రెడ్డి, భైంసా మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆనందరావు పటేల్, నిర్మల్ మాజీ ఎంపీపీ సాధ సుదర్శన్, మండల అధ్యక్షుడు గడ్డం ఇంద్రకరణ్ రెడ్డి, అజీమ్ పాల్గొన్నారు.


ఎమ్మార్ ఫంక్షన్ హాల్‌లో ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న శ్రీహరిరావు

సత్తెనపల్లి సొసైటీ రైతులకు అనుకూలంగా పనిచేస్తుంది

- సత్తెనపల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఆమంద శ్రీనివాస్

ఖానాపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సత్తెనపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గం రైతులకు అనుకూలంగా పనిచేస్తోందని ఆ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి ఆమంద శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఖానాపూర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సత్తెనపల్లి పీఏసీఎస్ పాలకవర్గంపై అనర్హత వేటు పడిందనే ప్రచారంలో వాస్తవం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని సొసైటీల పాలకవర్గాలపై ఆయా కారణాలతో ప్రభుత్వం వేటు వేసిందని, ఆ జాబితాలో సత్తెనపల్లి సొసైటీ లేదన్నారు. తమ సొసైటీలో ఎటువంటి అవినీతి జరగలేదన్నారు. తాము నిరంతరం రైతులకు అండగా నిలిచేలా పనిచేస్తున్నామని ఆమంద శ్రీనివాస్ స్పష్టం చేశారు. సత్తెనపల్లి సొసైటీ పరిధిలోని రైతులకు మరింత కాలం అందుబాటులో ఉండి సేవ చేస్తామన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, ఆత్మ కమిటీ ఛైర్మన్ తోట సత్యం, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కడార్ల గంగ నర్సయ్య, పాత ఎల్లాపూర్ మాజీ ఉప సర్పంచ్ కే. వీరేష్ ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆమంద శ్రీనివాస్

భీమన్నగుట్టను కాపాడాలని వినతి

నిర్మల్‌టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని దివ్యనగర్ సమీపంలో గల ముదిరాజ్ కులస్తులకు చెందిన భీమన్న గుట్ట ప్రాంతాన్ని కొందరు కబ్జా చేస్తున్నారు. శుక్రవారం భీమన్న గుట్ట ప్రాంతంలోని కొన్ని ఎకరాల భూమిని ప్రొక్లైన్‌సహాయంతో చదును చేయడం గమనించిన ముదిరాజ్ కులస్తులు దానిని అడ్డుకున్నారు. ఈ విషయమై ముదిరాజ్‌లకు కేటాయించిన భూమిని అన్యాక్రాంతం కాకుండా చూడాలని అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్‌కు ముదిరాజ్ కులస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్‌లు మాట్లాడుతూ... గతంలో హైకోర్టు ఉత్తర్వుల ద్వారా తమ కులస్తులకు ప్రభుత్వం భూమిని కేటాయించడం జరిగిందని తెలిపారు. ఎన్నో సంవత్సరాల నుంచి ముదిరాజ్‌లకు జీవనోపాధి కల్పిస్తున్న భీమన్నగుట్ట ప్రాంతాన్ని కబ్జాకు గురి కాకుండా చూడాలని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్‌ను కోరారు. గతంలో కూడా కొన్ని ఎకరాల భూమిని కొందరు కబ్జాకు గురిచేశారని, ఈ విషయంపై అధికారులకు తెలియజేసినప్పటికీ ఉన్నతాధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా భీమన్న గుట్ట ప్రాంతం అన్యాక్రాంతం కాకుండా చూడాలని వేడుకున్నారు. ఉద్యమాన్ని చేపడతామ ని ముదిరాజ్ కులస్తులు హెచ్చరించారు.


అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కులస్తులు

పిల్లల ఆసుపత్రిలో అరుదైన చికిత్సలు

నిర్మల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌లోని కావేరి పిల్లల ఆసుపత్రిలో అత్యాధునిక పరికరాలతో అరుదైన చికిత్సలు అందజేస్తూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న చిన్నారులకు ప్రాణం పోస్తున్నారు. సోనాల గ్రామానికి చెందిన ఓ నవజాత శిశువు 750 గ్రాములు, మస్కాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు కవలల్లో ఓ నవజాత శిశువు 665 గ్రాములు, మరో నవజాత శిశువు 640 గ్రాములు, వడ్యా ల్ గ్రామానికి చెందిన మరో నవజాత శిశువు 875 గ్రాముల అతి తక్కువ బరువుతో జన్మించడంతో వారిని ప్రాణాపాయ పరిస్థితుల్లో కావేరి ఆసుపత్రికి తీసుకువచ్చారు. దీంతో కావేరి ఆసుపత్రిలో ఇఫా ఫిల్టర్స్ ఉన్న మ్యా డ్యులర్స్ ఎన్‌ఐసీయూలో ఈ పిల్లలను చేర్చా రు. సీనియర్ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ అప్పాల చక్రధారి, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కావేటి శ్రీకాంత్, కావేటి నాగరంజని, ఇద్దరు డీఎంవోలు, అనుభవజ్ఞులైన నర్సింగ్ స్టాఫ్ రెండునెలల పాటు నిరంతర పర్యవేక్షణ చేసి ఆ చిన్నారులను ప్రాణాపాయస్థితి నుం చి కాపాడి శుక్రవారం డిశ్చార్జ్ చేశారు. చిన్నారులకు చికిత్స అందజేసి వారిని ఆరోగ్యంగా తమకు అప్పగించిన వైద్యులకు ఆ చిన్నారుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.


చిన్నారుల తల్లిదండ్రులతో ప్రముఖ చిన్నపిల్లల వైద్యుడు

రాష్ట్ర స్థాయికి ఎంపికైన సోన్ బాలికలు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సోన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా స్థాయి గోవిజ్ఞాన ప్రతిభా పరీక్షల్లో జడ్పీహెచ్‌ఎస్ సోన్‌కు చెందిన ఆరే జోష్ణవి (9వ తరగతి) శివరాత్రి గీతిక (6వ తరగతి) అనే ఇద్దరు బాలికలు ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 26వ తేదీన హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో వీరు పాల్గొననున్నారని ప్రధానోపాధ్యాయురాలు కే.ఆరాధన తెలిపారు. కాగా రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం పొం దిన వారికి లక్ష రూపాయలు, రెండోస్థానంలో ఉన్న వారికి 50 వేల రూపాయలు, మూడోస్థానంలో నిలిచిన వారికి 25 వేల రూపాయల నగ దు పారితోషికంతో పాటు ప్రశంసాపత్రాలను రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా అందించనున్నారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రతిభావంతులైన ఈ బాలికలను పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అభినందించారు.

సర్వే వెంటనే పూర్తి చేయాలి

- ఇంటిగ్రేటెడ్ స్కూల్ సాధన జేఏసీ కన్వీనర్


ఖానాపూర్‌లో మాట్లాడుతున్న నంది రామయ్య

ఖానాపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కోసం పట్టణ శివారులో గల 110 ఎకరాల ప్రభుత్వ భూమి నిర్వహిస్తున్న సర్వేపై అధికారులు నిర్లక్ష్యాన్ని వీడాలని ఇంటిగ్రేటెడ్ స్కూల్ సాధన జేఏసీ కన్వీనర్ నంది రామయ్య, గౌరవ అధ్యక్షులు సాయి లక్ష్మణ రావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఖానాపూర్‌లోని విశ్రాంతి భవనంలో నిర్వహించిన జేఏసీ సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా దీపావళి పండుగ లోపు సర్వేపై అధికారులు స్పష్టత ఇవ్వకపోతే పండుగ అనంతరం నాలుగు మండలాల ప్రజలతో కలిపి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. నాలుగు మండలాల విద్యార్థుల భవిష్యత్తు కోసం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే పోరాటంలో ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ నాలుగు మండలాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కో కన్వీనర్‌లు ఆకుల శ్రీనివాస్, కే. గంగారావు, బీసీ రాజన్న, ప్రధాన కార్యదర్శి కాశవేణి ప్రణయ్, కోశాధికారి ఎనగందుల నారాయణ, ముఖ్య సలహాదారులు కొత్తపెల్లి సురేష్, బీసీ రమేష్, పుప్పాల ఉపేందర్, రాపెల్లి రవీందర్, ఎంస సతీష్, పిట్టల భూమన్న, బి. రాజ్ కుమార్, బి. వర్మ, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

నేటి బంద్‌ను విజయవంతం చేయాలి

- జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు పొన్నం నారాయణ గౌడ్

నిర్మల్ రూరల్/ఖానాపూర్ అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని శనివారం చేపడుతున్న రాష్ట్రవ్యాప్త బంద్‌కు అన్ని పార్టీలు మద్దతు తెలిపాయని, బంద్‌ను విజయవంతం చేయాలని జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు పొన్నం నారాయణ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం మాట్లాడుతూ... అగ్రకులాలు వారు ఓర్వలేక హైకోర్టులో కేసు వేసి అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను నమ్మిస్తూ... రాజకీయ డ్రామా చేస్తుందని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా 60 శాతం ఉన్న బీసీలకు రాజకీయంగా వెనుకకు నెట్టుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 42 శాతం రిజర్వేషన్ అమలు కాకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే... రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు, బంద్‌లు పాటిస్తూ.. ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందులో బీసీ సంఘం జాతీయ నాయకులు అనుముల భాస్కర్, డాక్టర్ కత్తి కరిణ్, అశోక్ నాయక్, ప్రశాంత్, శివాజీ గౌడ్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న బీసీ సంఘాల నాయకులు

ఖానాపూర్‌లో ప్రతి ఒక్కరూ సహకరించాలి...

● **ఖానాపూర్ :** 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం బీసీ జేఏసీ ఇచ్చిన రాష్ట్ర బంద్ పిలుపును జయప్రదం చేసేందుకు ఖానాపూర్‌లో ప్రతి ఒక్కరూ సహకరించాలని బీసీ జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఖానాపూర్‌లోని విశ్రాంతి భవన ప్రాంగణంలో బీసీ జేఏసీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బంద్‌ను విజయవంతం చేసేందుకు ఖానాపూర్ మండలంలో వ్యాపార, వాణిజ్య సంఘాలన్నీ స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధించే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు నంది రామయ్య, బీసీ రాజన్న, కొత్తపల్లి సురేష్ కుమార్, ఆకుల శ్రీనివాస్, నిమ్మల రమేష్, ఎనగందుల నారాయణ, బీసీ రమేష్, అడ్డగట్ల రాజన్న, రాం భీమన్న, ఎన్. రమేష్, ఎల్. రాములు, లక్ష్మణ్, టి. లక్ష్మణ్, తదితరులున్నారు.


ఖానాపూర్‌లో నినాదాలు చేస్తున్న బీసీ జేఏసీ నాయకులు


కజ్జర్లలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో వెంకట్రావు

మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలి

తలమడుగు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): తలమడుగు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని మండల విద్యాధికారి వెంకట్రావు కోరారు. శుక్రవారం మండలంలోని ఎంపీపీఎస్ కజ్జర్ల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పాఠశాలలో విద్యార్థుల మధ్యాహ్నం ఉచిత భోజనాన్ని అందిస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న మిన్ను ప్రకారం భోజనం తప్పనిసరిగా అందించాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థుల నైపుణ్యాలను పరీక్షించారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం అమలును తీరును పరిశీలించడం జరిగింది. ఈ పరిశీలనలో భాగంగా విద్యార్థుల విద్యార్థుల నైపుణ్యాలను అడిగి విద్యార్థుల స్పందనలకు సంతృప్తి చెందారు. అదేవిధంగా మధ్యాహ్న భోజ నం తీరును పరిశీలించారు. ఇందులో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పత్తి చేలలో గంజాయి మొక్కల స్వాధీనం

ఉట్నూర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని వంక తుమ్మ గ్రామ పరిసరాల్లో పత్తి చేలలో అక్రమంగా సాగు చేస్తున్న గంజాయి సాగు చేస్తున్న ప్రాంతాల్లో పోలీసులు రెండు రోజులుగా దాడులు నిర్వహించి 59 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు అందిన పక్క సమాచారం మేరకు దాడులు నిర్వహించి వెట్టి భీంరావు వద్ద సాగు చేస్తున్న 47 మొక్కలు, గేడం విఠల్ దగ్గర నాలుగు మొ క్కలు, ఆత్రం బారిక్ రావు దగ్గర ఎనిమిది గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకోవడం జరిగిందని కేసు నమోదు చేసి దర్యాప్తులో ఉందని ఉట్నూర్ సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ గంజాయి విలువ సుమారు రూ.6 లక్షల వరకు ఉండవచ్చని తెలుస్తుంది.

డబ్బులు వసూలు చేసిన వ్యక్తి రిమాండ్

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇప్పిస్తానని నిరుద్యోగులను నమ్మించి డబ్బులు వసూలు చేసిన ప్రభుత్వ బోథ్ కళాశాల ప్రిన్సిపల్ కోవ విఠల్‌ను అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. అనంతా సొల్యూషన్ సంస్థ ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగం ఇప్పిస్తానని 45 మంది నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.లక్షల్లో వసూలు చేసినట్లు పేర్కొన్నారు. దాదాపు రూ.40 లక్షల వరకు వసూలు చేసినట్లు వివరించారు. ఆదిలాబాద్ పట్టణంలోని తిలక్‌నగర్‌కు చెందిన ఓ నిరుద్యోగి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని అన్నారు. నిరుద్యోగులెవరు ఉద్యోగాల పేరిట మోసం చేసే వారిని నమ్మవద్దని సూచించారు. ప్రభుత్వ నోటిఫికేషన్ వెలువడితే తప్ప ఎలాంటి ఉద్యోగం రాదని, ఇటీవల కాలంలో నకిలీ నోటిఫికేషన్‌లను సైతం కేటుగాళ్లు సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారని, వాటిని పరిశీలించాలని స్పష్టం చేశారు. మధ్యవర్తులను నమ్మి డబ్బులు ఇవ్వకూడదని పేర్కొన్నారు. ఎవరైన డబ్బులు డిమాండ్ చేస్తే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

విద్యార్థిని ఆత్మహత్యా యత్నం

తలమడుగు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని పాఠశాలలో గల ఫినాయిల్ తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడగా గమనించిన పాఠశాల సిబ్బంది వెంటనే 108 వాహనంలో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఆదిలాబాద్ రిమ్స్‌లో చికిత్స పొందుతుంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

జడ్జిపై దాడి చేసిన లాయర్‌ను కఠినంగా శిక్షించాలి

● ఎమ్మార్పీఎస్ నాయకులు

నేరడిగొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి మీద జరిగిన దాడిని ఖండిస్తూ, దాడికి పాల్పడ్డ అడ్వకేట్ రాకేష్ కిషోర్‌ను తక్షణమే అరెస్టు చేయాలని, అలాగే దాడి వెనుక ఉన్న శక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. నేరడిగొండలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, విహెచ్పీఎస్‌ల ఆధ్వర్యంలో నల్లజెండాలతో దళితుల ఆత్మగౌరవ నిరసన ప్రదర్శన ర్యాలీని నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ ధర్నాకు మండల ఇన్‌చార్జి గజ్జెల శంకర్ ముఖ్య అతిథిలుగా హాజరై మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పైనే దాడులకు దిగడం అనాగరికపు చర్య అని, ఈ ఘటనపై లోతైన విచారణ జరిపి దాడి వెనుక ఉన్న శక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ నిరసన ధర్నా అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ విశ్వనాథ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సారంగా, రవి, జి.సంతోష్, ఆడేళ్ల జల, సంతోష్, చిర్ర గంగాధర్, తోట ఆడేళ్ళు, జి.గంగాధర్, జి.భోజన్న, ఎన్.రాము, అశోక్, మోహన్, సీహెచ్ రవి, నవీన్, గోనే ఆడేళ్ళు తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గావాయ్ మీద జరిగిన దాడిని నిరసిస్తూ శుక్రవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ఎంఆర్‌పీఎస్ నాయకులు నిరసన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ ఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి కాంబ్లె బాలాజి మాదిగ మాట్లాడుతూ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్ దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి కేసు నమోదుచేయాలని, దాడి వెనకాల ఉన్న శక్తులను గుర్తించి వారిపై కూడా శిక్షలు పడేలా స్వతంత్ర దర్యాప్తు చేయాలని, సుప్రీంకోర్టులో ప్రజాస్వామ్యావాదులుగా గుర్తించబడ్డ సీనియర్ జడ్జిలతో విచారణ చేయించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతంకాకుండా తగు చర్యలు తీసుకునేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జీ దాసరి రాంప్రసాద్ మాదిగ, సహ ఇన్‌చార్జీ కొమ్మే పరశురాం మాదిగ, మోరేరంజు మాదిగ, సోమ్‌నాథ్ మాదిగ, నగేష్, తదితరులు పాల్గొన్నారు.


నేరడిగొండలో డీటీ విశ్వనాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


ఉట్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తూ..

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి : ఆడె

నేరడిగొండ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొందిడి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు రాథోడ్ రమేష్ ఆయన అనుచరులతో కలిసి బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఆడే గజేందర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలు చూసి, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ నాయకులు పార్టీలో చేరుతున్నారని అన్నారు. రానున్న జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకై కలిసి కట్టుగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొందిడి గ్రామ మాజీ సర్పంచ్ ఆడే జనార్ధన్, నాయకులు రాథోడ్ సుభాష్, మధుకర్, ధనరాజ్, శ్యామ్ రావు, ఆడే భీమ్ రావు, రవీందర్, గోవింద్ రావు నాయక్, రాం లక్ష్మణ్, జాదవ్ కబీర్ దాస్, సంతోష్ జాదవ్, రాథోడ్ శంకర్, రాథోడ్ సురేష్, గోవింద్ రావుశ్యామ్ రావు, ఆడే భీమ్ రావు, రవీందర్, గోవింద్ రావు నాయక్, రాం లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

కపాస్ కిసాన్‌పై రైతులకు అవగాహన

ఆదిలాబాద్ రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలోని గ్రామాల్లో పత్తి పంట సాగు చేసిన రైతులు తమ ఉత్పత్తిని అమ్ముకొనుటకు, కపాస్ కిసాన్ యాప్ ద్వారా మాత్రమే స్లాట్ బుకింగ్ చేసుకొని, అమ్ముకావాలని అదిలాబాద్ రూరల్ మండలం ఏఓ నగేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీఐ పత్తి కొనుగోళ్లలో ఎలాంటి అవకతవకలు జరగకుండా రైతులకు అన్ని రకాలుగా మేలు చేకూరాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కపాస్ కిసాన్ ఆప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. యాప్ ద్వారా రైతులు స్లాట్ బుకింగ్ చేసుకున్న పత్తిని మాత్రమే కొంటారని కాబట్టి రైతులు కపాస్ కిసాన్ యాప్ ద్వారా ఎలా స్లాట్ బుక్ చేసుకోవాలనే విషయాలను గ్రామాల్లో సభలు నిర్వహించి రైతులకు తెలియజేయడం జరుగుతుందని అన్నారు.

బీసీ బంద్‌కు మద్దతు : ఎమ్మెల్యే అనిల్

నేరడిగొండ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నేరడిగొండ తెలంగాణా రాష్ట్ర వ్యాప్తంగా శనివారం జరిగే బీసీ బంద్ కార్యక్రమానికి పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు మాజీ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు బీసీ బంద్ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పూర్తి మద్దతు తెలపాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

కొనసాగుతున్న గాలికుంటు టీకాలు

బజార్‌హత్నూర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాలలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం కొనసాగుతోంది. కాగా ప్రత్యేక ఈ శిబిరాలతో శుక్రవారం గంగాపూర్, హర్కాయి, రాంనగర్ గ్రామాల్లో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు అందించినట్లు పశువైద్యాధికారి డాక్టర్ పర్వేజ్ అహ్మద్ తెలిపారు. ఇందులో వైద్య సిబ్బంది, పాడి రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పోషణ మాసం.. ఆరోగ్య రక్షణే లక్ష్యం

నార్నూర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మాతా, శిశు సంపూర్ణ ఆరోగ్య రక్షణే లక్ష్యంగా ప్రభుత్వం సహకరిస్తుందని ఎం.శారద అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సెంటర్ నెంబర్.1లో పోషణ్ అభియాన్ మాసోత్సవాలను నిర్వహించారు. చిన్న పిల్లలు, మహిళలు, అంగన్‌వాడీ జాదవ్ స్వప్నతో ప్రతిజ్ఞ చేయించారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుదాం

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక విధానాలపై కార్మికులకు ఐక్య పోరాటాలకు సన్నద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.జయలక్ష్మి అన్నారు. సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన యూనియన్ 11వ జిల్లా మహాసభలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

పంట చేతికొచ్చేనా.. పరేషానే!

(5వ పేజీ తరువాయి...)

దిగుబడులను ఇంటికి చేర్చేందుకు మళ్లీ అవే కష్టాలు పడాల్సి వస్తుందని అన్నదాతలు వాపోతున్నారు.

కూలి డబ్బుల కోసం అప్పులే..

ఇన్నాళ్లు పంటల సాగుకు పెట్టుబడులు పెట్టిన రైతులు ప్రస్తుతం కూలి డబ్బుల కోసం కూడా అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అప్పు చేసి మరీ కూలీలకు అడ్వాన్సులు చెల్లిస్తున్నారు. దీంతో అదనంగా ఆర్థిక భారం పెరిగి పోతోందని రైతులు వాపోతున్నారు. పెట్టుబడి ఖర్చుల కోసం ఆదరబాదరగా పంటలను అమ్మేసుకుంటున్నారు. గతేడాది కిలో పత్తిని ఏరేందుకు కూలీలకు రూ.7 చెల్లించగా.. ఈసారి డిమాండ్‌ను బట్టి ఏకంగా రూ.10 చెల్లించాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. ఈ లెక్కన రోజుకి ఒక్కో కూలీకి రూ.600 నుంచి రూ.800ల వరకు చెల్లించాల్సి వస్తుంది.అలాగే రోజు వారి రవాణా ఖర్చులను రైతులే భరిస్తున్నారు. ఈయేడు అధిక వర్షాలతో అంతంత మాత్రంగానే కనిపిస్తున్న దిగుబడుల కు పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగిపోతున్నాయని రైతులు చెబుతున్నారు.

బీసీ బంద్‌కు వివిధ సంఘాల మద్దతు

(5వ పేజీ తరువాయి...)

మద్దతు తెలుపుతున్నామని ప్రకటించారు. సంఘం బాధ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు బంద్ విజయవంతమయ్యేలా కృషి చేయాలన్నారు. నాయీ బ్రాహ్మణ సంఘం నేతలు సైతం బంద్‌కు మద్దతు తెలిపారు. ఇందులో భాగంగా కటింగ్ దుకాణాలను మూసివేసి ఉంచాలని పిలుపునిచ్చారు.

ఉట్నూర్: స్థానిక సంస్థల ఎన్నికలలో చట్టబద్ధతతో కూడిన 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసి రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల పిలుపు మేరకు శనివారం తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త బంద్‌కు వ్యాపార సంస్థలు, విద్యా సంస్థల యజమానులు సహకరించాలని బీసీ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని అన్ని వ్యాపార సంస్థలను సందర్శించి బీసీల బంద్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కన్వీనర్ సీపతిలింగాగౌడ్, కో కన్వీనర్ బింగి వెంకటేశ్, కొండేరిరమేష్, జాదవ్‌రవి తదితరులు పాల్గొన్నారు.

బోథ్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలన్న డిమాండ్‌తో చేపట్టిన నేటి బందును విజయవంతం చేయాలని అన్ని రాజకీయ పక్షాల వారు డిమాండ్ చేశారు. బందుకు విద్యా సంస్థల వ్యాపార వర్గాల వారు అందరు సహకరించాలని పిలుపునిచ్చారు. ఇందులో మార్కెట్ కమిటీ చైర్మన్ బి.గంగారెడ్డి, మండల కన్వీనర్ శివారెడ్డి, తదితరులున్నారు.

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్): ఈనెల 18న బీసీ జేఏసీ ఆధ్వర్యంలో తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు బీజేపీ పార్టీ తరఫున సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. 42 శాతం రిజర్వేషన్‌లు ఎట్టి పరిస్థితుల్లో రావాలన్నారు. బంద్‌లో పార్టీ నాయకులు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు.

అలాగే, బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ల అమలు కోసం బీసీ జేఏసీ తలపెట్టిన బంద్‌కు తమ పూర్తి మద్దతు ఉంటుందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

తలమడుగు: 42శాతం బీసీ రిజర్వేషన్ల కోసం బీసీ జేఏసీ పిలుపు మేరకు శనివారం నిర్వహించే రాష్ట్రవ్యాప్త బంద్ కోసం అందరూ స్వచ్ఛందంగా బంధు పాటించాలని బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు మేకల రవి కాంత్ కోరారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి విలేకరులతో వారు మాట్లాడారు. బీసీ సంఘం నాయకులు బడగరి రవికాంత్, శ్రీకాంత్, శ్రీనివాస్, రాజు, అశోక్ తదితరులున్నారు.

'జనావాసాల మధ్య నుంచి మద్యం షాపులు ఎత్తి వేయాలి'

బోథ్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రంలో ఉన్న మద్యం దుకాణాలను జనావాసాలకు దూరంగా ఉంచాలని మండల కేంద్రానికి చెందిన ప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు పలువురు శుక్రవారం ఎక్సైజ్ సిబ్బందికి వినతి పత్రం అందించారు. వైన్‌షాపులు జనావాసాల మధ్య ఉండడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని వారు పేర్కొంటున్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సందీప్ బొడ్డు, శ్రీనివాస్, పలువురు యువకులు, తదితరులున్నారు.

బాసరలో శృంగేరి శారదా పీఠాధిపతి


పీఠాధిపతి భారతిస్వామి

బాసర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : శృంగేరి శారదా పీఠం పీఠాధిపతి విధుశేఖర భారతి స్వామి శుక్రవారం బాసర పుణ్యక్షేత్రానికి చేరుకున్నారు. విజయయాత్రలో భాగంగా రాష్ట్రంలో పర్యటిస్తున్న పీఠాధిపతికి బాసర సరస్వతీ అమ్మవారి ఆలయం వద్ద ఘన స్వాగతం లభించింది. ఆలయ పండితులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేద పండితులు, భక్తులు మంగళవాయిద్యాల నడుమ స్వామిజీకి స్వాగతం పలికారు. అనంతరం స్వామిజీ సరస్వతి మాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు రోజుల పాటు బస చేయనున్న పీఠాధిపతి ఆలయంలో పలు ముఖ్యమైన కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. పుణ్యక్షేత్రంలో కొత్తగా నిర్మించిన శంకరమఠం ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్వామీజీ పాల్గొంటారు. అలాగే నూతనంగా నిర్మించిన లలితాదేవి ఆలయంలో విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరుకానున్నారు. పీఠాధిపతి పర్యటన దృష్ట్యా పోలీసులు భారీబందో బస్తు ఏర్పాటు చేశారు. పర్యటనలో పీఠాధిపతి భక్తులకు ఆధ్యాత్మిక సందేశాన్ని ఇవ్వనున్నారు.


సీపీఆర్‌పై అవగాహన అవసరం

నర్సాపూర్(జి), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడే కీలకమైన కార్డియో పల్మనరీ రిసెసిటేషన్ (సీపీఆర్) ప్రక్రియపై నర్సాపూర్(జి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో 108 అంబులెన్స్ సిబ్బంది పాల్గొని విద్యార్థులకు సీపీఆర్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమానికి నర్సాపూర్(జి) 108 సిబ్బంది అయిన ఈఎంటీ ఆనంద్ కుమార్, ఈఎంటీ సృజన్, పైలెట్ సాయి కుమార్, ప్రణయ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈఎంటీ ఆనంద్, పైలెట్ సాయికుమార్‌లు మాట్లాడుతూ... ప్రతిఒక్కరూ సీపీఆర్‌పై ప్రాథమిక జ్ఞానం కలిగి ఉండాలని, తద్వారా ఆపదలో ఉన్నవారికి తక్షణ సహాయం అందించి, వారి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ నైపుణ్యం ఎంత ముఖ్యమైనదో విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు అవగాహన కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని, సీపీఆర్ పద్ధతులను తెలుసుకున్నారు.

భైంసాలో..

భైంసా : ప్రతిఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని 108 ఈఎంటీ పూజరి లక్ష్మణ్ సూచించారు. శుక్రవారం రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసా పట్టణంలోని జూనియర్ కళాశాలలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈఎంటీ లక్ష్మణ్ విద్యార్థులకు సీపీఆర్ చేసే విధానంపై పలు సూచనలు, సలహాలు చేశారు. ఇందులో 108 పైలెట్ గౌతమ్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో వ్యాధులు దూరం


పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

భైంసా, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పశుపోషణలో ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే జంతువులకు ఎలాంటి వ్యాధులు దరిచేరవని పశువైద్యాధికారి డా.విఠల్ పేర్కొన్నారు. శుక్రవారం భైంసా మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. పశువులు ఉన్న రైతులు తప్పకుండా పలు జాగ్రత్తలు పాటించాలన్నారు. పశువులు ఉన్న రైతులు తప్పకుండా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలన్నారు. పశు సంపదను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని సూచించారు. ఇందులో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ హామీని నిలబెట్టుకోండి

● సీపీఎస్ ఉపాధ్యాయ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు


సన్మానిస్తున్న సీసీఎస్ ఉపాధ్యక్షుడు కృష్ణారావు

తానూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ప్రణాళికలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని తెలంగాణ సీపీఎస్ ఉపాధ్యాయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు అన్నారు. శుక్రవారం. మండలంలోని బోసి ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన పిడీ శ్రీధర్‌ను సన్మానించారు. అదే విధంగా మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన రజిత స్వరూపరాణి ఉపాధ్యాయుల ఆయా పాఠశాలలో సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీపీఎస్ విధానం వల్ల రెంటు లక్షల పైచిలుకు కుటుంబాలు వేదన అనుభవిస్తున్నాయని, సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరారు. ఎన్నికలకు ముందు సీఎం రేవంతర్‌ఋెడ్డి అధికారంలోకి రాగానే పాతపెన్షన్ హామీని సత్వరమే అమలు చేస్తామని చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సీపీఎస్ రద్దును తక్షణమే జరపాలని కోరారు. 2011లో తాను సీపీఎస్ ఉద్యమాన్ని ప్రారంభించామని ఈ 14 సంవత్సరాలలో గ్రాటివటీ ఫ్యామిలీ పెన్షన్ను సాధించామని, త్వరలోనే పూర్తి స్థాయి పాతన పెన్షన్ సాధిస్తామని ధీమాను వ్యక్తం చేశారు. పాత పెన్షన్ విధానం అమలు చేయడం వల్ల ప్రభుత్వంపై భారం ఏమీ పడవోదని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజేశేఖర్, సీపీఎస్ నాయకులు పండరి, బూసి సుధాకర్, గజానంద్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లకు బీజేపీనే అడ్డు


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు డి. పొశెట్టి

లోకేశ్వరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు బీజేపీనే అసలు అడ్డు అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు డి. పోశెట్టి అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం లోకేశ్వరం మండల కేంద్రంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ... తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుకు బీజేపీనే అసలు అడ్డం పడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి అన్ని రాజకీయ పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపి కేంద్రానికి పంపిస్తే దాన్ని ఆమోదించకుండా తొక్కి పెట్టిందన్నారు. పైగా రాష్ట్రంలో బీసీ బంద్‌కు మద్దతు ఇస్తుందన్నారు. బీసీ సంఘాల నేతలు బీజేపీపై పోరాటం చేయాలన్నారు. బీజేపీ రెండు నాలుకల ధోరణిని ఎండగట్టాలని కోరారు. అందరూ అనుకూలమే అన్నప్పుడు పార్లమెంట్‌లో బిల్లు ఎందుకు ఆమోదించడం లేదు. తొమ్మిదవ షెడ్యూల్‌లో ఎందుకు చేర్చడం లేదు అని ప్రశ్నించారు. బీజేపీ అసలు రంగును తెలియజేయడానికి 18వ తేదీన సీపీఎం స్వతంత్రంగా నిరసన ర్యాలీ చేస్తుందన్నారు. ఈ ఆందోళనలో ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు దిగంబర్, ముత్తన్న, తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

నేటి బంద్‌ను విజయవంతం చేయండి

కుంటాల : శనివారం రోజు తెలంగాణ రాష్ట్ర బంద్‌కు పిలుపు నిచ్చిన సందర్భంగా కుంటాల మండల కేంద్రంలో బీసీ నాయకులతో పాటు వివిధ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో బంద్‌ను ప్రకటిస్తున్నట్లు చెప్పారు. బంద్ తలపెట్టిన సందర్భంగా కులాలు, పార్టీలకు అతీతంగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పడకంటి దత్తు, దొనికెన వెంకటేష్, జక్కుల గజేంధర్, శరత్ గౌడ్, నాలం మహేందర్, కుబీర్ రాజన్న, సుదర్శన్ పటేల్, చిన్నోల్ల రవి, ప్రశాంత్, ఆష్టం సాయి తదితరులు ఉన్నారు.

సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సంపూర్ణ మద్దతు

ఖానాపూర్ : 42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల జేఏసీ ఇచ్చిన నేటి (శనివారం) రాష్ట్ర బంద్ పిలుపునకు సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఆ పార్టీ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లను సాధించే వరకు బీసీ సంఘాలు చేసే పోరాటానికి తాము అండగా ఉంటామన్నారు.

విద్యార్థులకు పెన్నులు, నోట్‌బుక్కుల పంపిణీ


విద్యార్థులకు నోట్ బుక్కులను పంపిణీ చేస్తున్న దృశ్యం

ముథోల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికల తెలుగు మీడియం, ప్రాథమిక పాఠశాల తెలుగు మీడియం విద్యార్థులకు డాక్టర్ సరస్వతి ఆనంద్ పరివార్ మహారాజ్ బ్రహ్మేశ్వర్ శుక్రవారం తాను స్వయంగా 275 మంది విద్యార్థినులకు నోట్ బుక్కులు, పెన్నులను పంపిణీ చేశారు. అలాగే 10వ తరగతి విద్యార్థులకు పెన్నులు, నోట్ బుక్కులు, పరీక్ష ప్యాడ్లు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సరస్వతి ఆనంద్ మహారాజ్ బ్రహ్మేశ్వర్ మాట్లాడుతూ... విద్యార్థినులు క్రమశిక్షణతో ఆనందంతో బాగా చదువుకొని, అమ్మ నాన్నలను, గురువులను గౌరవిస్తూ మంచి స్థాయిలో ఎదగాలన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని కోరారు. మంచి స్థాయిలో ఉండాలని ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థుల కొరకు తన వంతు సహాయం ఎల్లవేళలా చేయడానికి నిరంతరం తపిస్తానన్నారు. తనకు అవకాశం ఇచ్చిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలికి, ఉపాధ్యాయ బృందానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా స్వామీజీని పాటశాల తరపున సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గీత, ఉపాధ్యాయులు కవిత, స్వర్ణలత, నీరజ, అంజుమ్, కొక్కుల గంగాధర్, సరిత దేవి, లక్ష్మీ, ఉషా, కిరణ్మయి, కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు న్యాయమూర్తిపై దాడిని ఖండించిన ఎమ్మార్పీఎస్


వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నిర్మల్ రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు బొబ్బిలి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఎమ్మార్వో ఆఫీస్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించి, అనంతరం ఎమ్మార్వోకు వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇది కేవలం న్యాయమూర్తిపై జరిగిన దాడి కాదని ఇది దేశ రాజ్యాంగాన్ని అనుసరిస్తున్న ప్రతి ఒక్కరి మీద జరిగిన దాడి అని అన్నారు. ఈ కేసును సుమోటోగా స్వీకరించి లోతైన విచారణ చేపట్టి ఈ దాడికి పాల్పడ్డ ఆ న్యాయవాదిని దాడి వెనుకాల ఉన్న రాజ్యాంగ విద్రోహశక్తులను గుర్తించి సమగ్ర విచారణ చేపట్టి ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీగా చట్టాలను రూపొందించి తగు న్యాయం చేయాలన్నారు. లేని పక్షంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో ఈ నెల 27న హైదరాబాద్ నడిబొడ్డున భారీ ప్రదర్శన నిర్వహించబోతున్నందున వేలాది మంది తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ శనిగారపు రవి, సీనియర్ నాయకులు కుంటాల రాజేశ్వర్, తెడ్డు గంగన్న, సూర్య, వంశీ, రాజేశ్వర్, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

ఖానాపూర్ : సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ ఖానాపూర్ శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మురళీకృష్ణ మాట్లాడుతూ.... బెంచ్ మీద లాయర్ల వాదనలు వింటున్న సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై రాకేష్ కిషోర్ అనేవ్యక్తి దాడికి పాల్పడడం సరికాదన్నారు. ఈ ఘటనకు కారకులైన వారిపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మునుగురి ప్రణీత్, హరీష్, వసంత్, తదితరులున్నారు.

చెక్కుల పంపిణీ

లోకేశ్వరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముథోల్ స్థానిక శాసన సభ సభ్యులు పవార్ రామారావు పటేల్ పాల్గొన్నారు. మండలంలోని ఆయా గ్రామాల కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ.. అర్లీ బ్రిడ్జితో పాటు అర్లీ ఎక్స్ రోడ్డు నుంచి లోకేశ్వరం వరకు రోడ్డు మంజూరయ్యిందని తెలిపారు. కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, భైంసా ఆత్మ చైర్మన్ నర్సారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్ రావు, తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో సల్మాన్ రాజ్, మాజీ ఎంపీపీ లలిత భోజన్న, ఎంపీటీసీ జైసాగర్ రావు పాల్గొన్నారు.

కుంటాల : పేదప్రజలకు అండగా కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ప్రభుత్వం అందజేస్తుందని ముథోల్ ఎమ్మెల్యే రామరావు పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం కుంటాల రైతువేదికలో కుంటాల మండలంలోని పలు గ్రామాలకు చెందిన 64 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డకు ఈ కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ ఎంతో దోహదపడుతుందన్నారు.

ఆదివాసీల సంస్కృతి ఎంతో గొప్పది


గౌరాపూర్‌లో ఎస్పీ, ఏఎస్పీలకు స్వాగతం పలికిన గ్రామస్థులు


ఆదివాసీలతో కలిసి నృత్యాలు చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

- ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్
- గుస్సాడీ దండారిఉత్సవాల్లో పాల్గొన్న ఎస్పీ అఖిల్ మహాజన్, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్
- దండారీ ఉత్సవాల్లో ఆదివాసీలతో కలిసి నృత్యాలు చేసిన ఎస్పీ, ఏఎస్పీ

ఇంద్రవెల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆది వాసీ సంస్కృతి ఎంతో గొప్పదని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం మండలంలోని గౌరాపూర్ గ్రామంలో గుస్సాడి దండారీ ఉత్సవాల్లో ఎస్పీ అఖిల్ మహాజన్‌తో పాటు ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్‌లను ఆది వాసీ గిరిజనులు తమ సంస్కృతి సాంప్రదాయ పద్ధతిలో గుస్సాడీ నృత్యాలతో ఘనస్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా గుస్సాడి నృత్యాలను తిలకించారు. అనంతరం ఆది వాసీలతో ఎస్పీ కలిసి నృత్యాలు చేశారు. ఆదివాసీ మహిళలతో ఏఎస్పీ కాజల్ సింగ్ నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ సీఐ మడావి ప్రసాద్, స్థానిక ఎస్సై సాయన్న, గ్రామ పటేల్ మడావి మారుతి, మహాజన్ పూసం బొజ్జు, దేవరి మడావి ఉమేష్, యూత్ సభ్యులు మంగం అంకుష్, సీడ్మాకి రాము, మడావి సుంగు పాల్గొన్నారు.


బెల్సారీ రాంపూర్‌లో దండారిలో పాల్గొన్న ఎస్సై విక్రమ్, ఎంపీపీ సంతోష్

ఆదిలాబాద్ (గుడిహత్నూర్): మండ లంలోని మాన్కపూర్‌లో నిర్వహించిన గుస్సాడీ దండారి ఉత్సవాల్లో ఎస్పీ అఖిల్ మహాజన్, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్ పాల్గొన్నారు. ఆదివాసుల సంప్రదాయ గుస్సాడి నృత్యం చేస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడు తూ ఆదివాసుల సంస్కృతి సాంప్రదాయాలు మన సమాజానికి అద్దం పట్టేలా ఉన్నాయన్నారు. ఇలాంటి దండారి గుస్సాడి ఉత్సవాలు ఐక్యత, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటం లో కీలకమన్నారు. ఏఎస్పీ కాజల్ సింగ్ మహిళలతో కలసి ఎంతో ఉత్సాహంతో నృత్యం చేయడంపై మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ పటేల్ సర్మేడీలు కలిసి ఎస్పీ అఖిల్ మహాజన్, ఏఎస్పీ కాజల్ సింగ్‌ని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ సీఐ బండారి రాజు, ఎస్సై శ్రీకాంత్ గ్రామ పటేల్లు పాల్గొన్నారు.

దండారి (గుస్సాడి) ఉత్సవాల్లో ఆడే గజేందర్

నేరడిగొండ: మండలంలోని రెంగన్ వాడి గ్రామంలో నిర్వహించిన దండారి (గుస్సాడి) ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం దండారి ఉత్సవానికి గ్రామప్రజల ఆహ్వానం మేర కు కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్థులు నిర్వహించే ఉత్సవాలు ఆదివాసి బిడ్డలకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పటేళ్లు, దేవరీ, మహాజన్ నాయకులు ఆడే జనార్ధన్, రాథోడ్ సుభాష్, రాథోడ్ మధుకర్, ఆడే వినాయక్, శ్యామ్ రావు, కబీర్దాస్, ఒ.సురేష్, ఆడే గణేష్, సంతోష్,శంకర్, ఆడే రవీందర్, భీంరావు, రాజ్ కుమార్ రాహుల్ పాల్గొన్నారు.


ఆదివాసీ మహిళలతో కలిసి నృత్యాలు చేస్తున్న ఏఎస్పీ కాజల్‌సింగ్

నిగినిలో గుస్సాడి సందడి

బోథ్: మండలంలోని నిగిని గ్రామంలో శుక్రవారం ఒక సారి పండుగ వేడుకలు ఘనంగా జరిగిన గ్రామానికి అతిథులుగా జీడిపల్లి గ్రామస్థులతో పాటు సారంగాపూర్ మండలంలోని ఇప్పచెల్లిమే గ్రామ గిరిజనులు దండారి పండుగ వేడుకలకు రావడం జరిగింది. వచ్చిన వారిని ఘనంగా స్వాగతించి ఆదివాసీలు అతిథ్యం ఇచ్చారు. రోజంతా నృత్యాలు చేసి అలరించారు.


గ్రామంలో దండారి పండుగ వేడుకల్లో పాల్గొన్న గుస్సాడిలు

కనుల పండుగగా దండారి సంబరాలు

భీంపూర్: మండలంలోని బెల్సారి రాంపూర్, మార్కగూడ, టెక్డి రాంపూర్ తదితర గ్రామాల్లో శుక్రవారం ఆదివాసీ సహోదరుల దండారి నృత్యాలు అలరించాయి. ప్రత్యేకమైన వస్త్రాధారణతో డప్పు వాయిద్యాలతో గుసాడి నృత్యాలు లయ బద్ధంగా నిర్వహించారు. పరిసర గ్రామాల ప్రజలు దండారి నృత్యాలు చూడడానికి తరలివచ్చారు.


గుస్సాడిలతో ఆడే గజేందర్


మాన్కాపూర్‌లో ఎస్పీని సన్మానిస్తున్న గ్రామస్థులు


ఎస్పీ, ఏఎస్పీలకు శాలువాతో సన్మానిస్తున్న గ్రామస్థులు

సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనం.. ఆదివాసీలు

- పట్నాపూర్ గుస్సాడిలకు ఆదిత్యం ఇచ్చిన పున్నగూడ.ఆదివాసీలు

తలమడుగు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నేటి శాస్త్ర సాంకేతిక యుగంలోనూ ఏఐ టెక్నాలజీ వచ్చినప్పటికీ దశాబ్దాలుగా వస్తున్న సంస్కృతి సాంప్రదాయాలను కాపాడడంలో ఆదివాసులు ముందున్నారు. ఉద్యోగ ఉపాధి ఇతర ఉపాధి కోసం ఎక్కడికి వెళ్లినా దీపావళి పండుగకు ఆదివాసి కుటుంబ సభ్యులు ఏకమై పండుగను ఘనంగా జరుపుకుంటారు. ఇందులో భాగంగా అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలో ఆదివాసులు తమ ఇష్టమైన పండుగ గుస్సాడీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం మండలంలోని జరీ, పునగూడ గ్రామంలో బోథ్ మండలం పట్నాపూర్ నుంచి వచ్చిన అతిథి గుసాడిలకు గ్రామస్తులు సాంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికి వారికి అతిథి మర్యాదలు చేపట్టారు.


పొన్నగుడ గ్రామంలో నృత్యాలు చేస్తున్న గుస్సాడీలు

గాజుల వేడుక.. స్నేహానికి ప్రతీక


గిర్నూర్ గ్రామంలో ఒకరినొకరు గాజులు వేసుకుంటున్న మహిళలు

బజార్‌హత్నూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిర్నూర్ గ్రామంలో మహిళలు శుక్రవారం ఒకరినొకరు గాజులు వేసుకుంటూ తమ స్నేహ భావాన్ని వ్యక్తపర్చుకున్నారు. గ్రామంలోని ఆయా కాలనీలలో మహిళందరూ కలిసి గాజులు వేసుకుని కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఇక నుంచి ప్రతీ ఏడాది కలిసి పండగ జరుపుకోవాలని నిర్ణయించామన్నారు. ఈ పండగ కొత్త ఆనందాన్ని అందిచ్చిందని, అందరు కలిసి ఒకరినొకరు ఆప్యాయతగా పలకరించుకున్నారు. ఈ కార్యక్రమంతో గ్రామంలో సందడి నెలకొంది.

విద్యార్థులు హాజరు శాతాన్ని పెంచుకోవాలి

తానూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తమ హాజరు శాతాన్ని పెంచుకోవాలని తానూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పణి రాజశేఖర్ అన్నారు. శుక్రవారం ఆధ్యాపకులతో విద్యార్థుల ఇంటింటికి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో హాజరు శాతంపై వివరించినట్లు తెలిపారు. విద్యార్థులకు ఎఫ్ఆర్ఎస్ ముఖ ఆధారిత హాజరు ప్రవేశ పెట్టడం జరిగిందని, కావున విద్యార్థులకు తప్పకుండా కళాశాలకు పంపాలని కోరినట్లుగా తెలిపారు. తప్పకుండా 65శాతం హాజరు శాతం లేకపోతే బోర్డువారు కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, దీంతో విద్యార్థికి కష్టం అవుతుందని తల్లిదండ్రులకు ఆధ్యాపకులు తెలిపినట్లుగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాపకులు రాజేందర్, విజయ్‌కుమార్, నరేష్, ఇమ్రాన్, నగేష్ పాల్గొన్నారు.


విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఆధ్యాపకులు

అక్రమ నిర్మాణాలను కూల్చేసిన అధికారులు

- ఎమ్మెల్యే, కలెక్టర్‌ల పరిశీలన
- స్పందించిన యంత్రాంగం

నిర్మల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నిర్మల్‌లోని స్థానిక దివ్య నగర్‌లోని అయ్యప్ప ఆలయ ప్రాంతంలోని సర్వే నెంబర్ 534లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చి వేశారు. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు జరిపారంటూ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులు ఆక్రమిత ప్రదేశానికి వెళ్లి విచారణ జరిపారు. దీంతో వెంటనే జేసీబీలతో అక్రమ నిర్మాణాలను కూల్చి వేయించారు. చెరువులు, గుట్టలు, అసైన్డ్ భూముల్లో అక్రమ నిర్మాణం చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు. అనంతరం ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. నిర్మల్‌లో కొంత మంది బడా వ్యక్తులు ఇష్టానుసారంగా ప్రభుత్వ భూములు ఆక్రమించుకొని వాణిజ్య నిర్మాణాలు చేపడుతున్నారని అలాంటి వారందరినీ వదిలిపెట్టేది లేదన్నారు.


జేసీబీ సహాయంతో అక్రమ కట్టడాలను కూల్చుతున్న దృశ్యం


నిర్మల్‌లోని దివ్య గార్డెన్ ప్రహరీని కూల్చిన అధికారులు

సీజేఐపై దాడి హేయమైన చర్య

ఇంద్రవెల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యో తి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి హేయమైన చర్య అని ఎంఆర్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కాంబ్లే బాలాజీ మాదిగ అన్నారు. ఎంఆర్పీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ ప్రవీణ్ కుమార్‌కు డిమాండ్‌తో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనని పేర్కొన్నారు. జస్టిస్ గవాయ్ దళితుడు కావడం వల్లే ఈ దాడి జరిగిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షుడు ఆందారే బాలాజీ మాదిగ, జిల్లా కార్యదర్శి ఉప్పులేటి శీను, తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయాలి

ఇచ్చోడ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన సోయాబిన్, మొక్కజొన్న పంటలను వెంటనే కొనుగోలు చేయాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. శుక్రవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌కి రైతులు తీసుకువచ్చిన సోయాబిన్, మొక్కజొన్న పంటలను వెంటన కొనుగోలు చేపట్టే విధంగా నాఫెడ్, మార్క్‌ఫెడ్ అధికారులు చొరవ చూపలన్నారు. ఈ కార్యక్రమంలో రెతులు రవీందర్‌సింగ్, శ్రీనివాస్‌రెడ్డి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.


ఇచ్చోడ మార్కెట్‌యార్డును సందర్శించిన సంగెపు బొర్రన్న

ప్రతీ కార్యకర్త అభిప్రాయాన్ని తెలియజేయవచ్చు

- నర్సాపూర్(జి) కాంగ్రెస్ సమావేశంలో ఏఐసీసీ పరిశీలకుడు డాక్టర్ అజయ్ సింగ్

నర్సాపూర్(జి), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్(జి) మండల కేంద్రంలో నిఎంఆర్ గార్డెన్‌లో శుక్రవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ఏఐసీసీ పరిశీలకుడు డాక్టర్ అజయ్‌సింగ్ ముఖ్య అతిథిగా ప్రసంగించారు.

అభిప్రాయ సేకరణకు పిలుపు

సంఘటన సృజన్ అభినయ్ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ అజయ్ సింగ్ మాట్లాడుతూ ప్రతీ కార్యకర్తల తన అభిప్రాయా న్ని తెలియజేయవచ్చని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ పార్టీ బలోపేతానికి, దిశానిర్దేశానికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన సూచించారు. ఈ సమావేశంలో డాక్టర్ అజయ్ సింగ్‌తో పాటు టీపీసీసీ పరిశీలకుడు రాం భూపాల్, ముథోల్ మాజీ ఎమ్మెల్యేలు విఠల్ రెడ్డి, నారాయణ రావు పటేల్, డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమండ్ అలీ, నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద రావు పటేల్, నిర్మల్ మాజీ ఎంపీపీ సాద సుదర్శన్ మండల అధ్యక్షుడు గడ్డం ఇంద్రకరణ్ రెడ్డి, అజీమ్‌తో పాటు ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ జడ్పీ చైర్మన్ అశోక్

పాఠశాలల తనిఖీ

ఉట్నూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండల పరిషత్ ప్రాథమికొన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలను మండల విద్యా శాఖ అధికారి ఆశన్న శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. బీర్సాయిపేట్, బలాన్పూర్, దంతనపల్లి పాఠశాలలను సందర్శించి తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు సమయం పాటిస్తూ పాఠశాలలకు హాజరుకావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నందున ఉపాధ్యాయులు ప్రతీ రోజు పాఠశాలలకు హాజరై విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఉపాధ్యాయులు బోధించాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం మెరుగు పరచాలన్నారు. తాను చదువుకున్న పాఠశాలను తాను పర్యవేక్షించే అధికారిగా పాఠశాలకు రావడం ఆనందాన్ని కలిగించిందని, తనలాగే విద్యార్థులందరూ బాగా చదువుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు.


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో ఆశన్న

ప్రాణాన్ని నిలిపే సంజీవని.. సీపీఆర్

బజార్‌హత్నూర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గుండెపోటు వచ్చిన సమయంలో ఆ వ్యక్తికి సీపీఆర్ ద్వారా ప్రాణదానం చేయొచ్చని, సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిస్కిటేషన్) ప్రాణాన్ని నిలిపే సంజీవని అని డాక్టర్ భీంరావ్ అన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సీపీఆర్ పద్ధతిపై విద్యార్థులకు 108 సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు. నిండు ప్రాణాలను నిలబెట్టుకోవచ్చని, సీపీఆర్ పై ప్రతీ ఒక్కరికీ అవగాహన అవసరమన్నారు. ఈ సందర్భంగా కళ్ళముందు ఎవరికైనా ఈ పరిస్థితి కనిపిస్తే హఠాత్తుగా వారిని ఎలా కాపాడుకోవాలో విద్యార్థులకు 108 ఈఎంటీ సతీష్ డెమో చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ భగత్ రాంకిషన్, ప్రధానోపాధ్యాయులు జే.భూమన్న, ఉపాధ్యాయులు రమేష్, భగత్ బాపురావ్, శ్రీనివాస్ 108 పైలెట్ నవీన్ కుమార్, మహేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం


స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ముథోల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని రబీంద్ర ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ ఆసంవార్ సాయినాథ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన ముథోల్‌లోని రబీంద్ర ఉన్నత పాఠశాలలో ప్రార్థన సమయంలో విద్యార్థులచే స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ వ్యక్తి గత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అపరిశుభ్రమైన పరిసరాలతో వివిధ రకాల వ్యాధులకు గురవుతామని పేర్కొన్నారు. విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచి వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాజేందర్, డైరెక్టర్ పోతన్న యాదవ్, చైర్మన్ భీమ్‌రావు దేశాయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో రోడ్డుకు మరమ్మతులు

ముథోల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరోడా నుంచి ఎడ్‌బిడ్ వరకు ఉన్న గుంతలు పడ్డ రోడ్డుకు ఎమ్మెల్యే పవార్ రామారావు చొరవతో మరమ్మతులకు నోచుకుంది. అడుగడుగునా గుంతలు పడ్డ రోడ్డుపై ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవడంతో కొన్ని రోజుల నుంచి బస్సు కూడా ఆర్టీసీ వారు నడపడం లేదు. దీంతో చించాల, వెంకటాపూర్, ఎడ్‌బిడ్, ఎడ్‌బిడ్ తండా, చింతకుంట తండా గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. అంతే కాకుండా వాహన చోదకులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆయా గ్రామ ప్రజల విన్నపం మేరకు ఎమ్మెల్యే గుంతలు పడ్డ రహదారి తాత్కాలికంగా మరమ్మతులకు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే సూచన మేరకు శుక్రవారం ఎడ్‌బిడ్ బీజేపీ నాయకులు నిమ్మ పోతన్న, దత్తాద్రి, భూమన్న, రామచందర్ రెడ్డిలు గుంతలను పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మెల్యేకు గ్రామస్థులు ధన్యవాదాలు తెలిపారు.


రోడ్డుకు మరమ్మతుల చేయిస్తున్న దృశ్యం

పనిచేయని చేతి పంపుతో ఇబ్బందులు

భీంపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యో తి): మండలంలోని అంతర్గావ్‌లో చేతిపంపు చెడి పోయి రోజులు గడుస్తున్నా అధకారులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చేతి పంపును మరమ్మతులు చేసి తాగునీటిని అందించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.


అంతర్గావ్‌లో చెడిపోయి చేతి పంపు

కార్తీక దీపోత్సవం కరపత్రాల ఆవిష్కరణ

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కోటి వత్తుల కార్తిక దీపోత్సవం కార్యక్రమాన్ని ఈనెల 27న జిల్లాకేంద్రంలోని డైట్ మైదానంలో నిర్వహించనున్నట్లు కార్తీక దీపోత్సవం నిర్వహణ కమిటీ అధ్యక్షుడు గంగ్రత్ సంతోష్ తెలిపారు. స్థానిక శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. వేద పండితుల సమక్షంలో కార్తీక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నామని, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గణేష్ వర్మ, వేణు, సంతోష్, రాజేశ్వర్, కేదార్నాథ్ పాల్గొన్నారు.

ఒక్క రోజే 221 దరఖాస్తులు

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మద్యం దుకాణాల కేటాయింపుకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జోరందుకుంది. గత 20 రోజులుగా టెండర్ల స్వీకరణ కొనసాగుతుండగా... 170 దరఖాస్తులు వచ్చాయి. అయితే శుక్రవారం ఒక్క రోజే 221 దరఖాస్తులు స్వీకరించినట్లు ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు. ఇందులో అత్యధికంగా 5వ నెం. దుకాణానికి 23 టెండర్లు దాఖలయ్యాయి. శనివారం చివరి రోజు కావడంతో అంచనాలకు తగ్గట్లుగానే టెండర్లు దాఖలవుతాయని భావిస్తున్నారు.

ఆదివాసీల సంస్కృతి ఎంతో గొప్పది

● ఎస్పీ అఖిల్ మహాజన్ ● గుస్సాడీ ఉత్సవాల్లో పాల్గొన్న ఎస్పీ, ఉట్నూర్ ఏఎస్పీ ● ఏజెన్సీలో కొనసాగుతున్న వేడుకలు



గౌరాపూర్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్



పొన్నగూడకు ఆతిథ్యం కోసం వచ్చిన బోథ్ మండలంలో పాట్నాపూర్ గుస్సాడీ బృందం

7లో



ఏటీడీవోను సన్మానిస్తున్న ఆలయ పీఠాధిపతి

నాగోబాను దర్శించుకున్న ఏటీడీవో

ఇంద్రవెల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఆరాధ్య దైవం కేస్లాపూర్ నాగోబాను అసిస్టెంట్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పొట్ల సదానందం దర్శించుకున్నారు. శుక్రవారం కేస్లాపూర్ నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్రావు ఆధ్వర్యంలో ఆయనకు శాలువాతో సన్మానించారు. అనంతరం నాగోబా ఆలయ విశిష్ఠతను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి మెస్రం శేకు, నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం ఆనంద్‌రావు, మాజీ సర్పంచ్ మెస్రం నాగనాథ్, మహాజన్ కినక శేకు, కారోబారి కోట్నాక్ భారిక్ రావ్, కోట్నాక్ కోసే రావ్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ గురువారం ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదిలాబాద్ నుంచి కిన్వట్‌కు అనుసంధానించే రహదారి నిర్మాణాల గురించి ఆయనతో చర్చించారు. ఎంపీ వెంట కిన్వట్ ఎంఎల్‌ఏ కేరమ్ భీంరావు ఉన్నారు.

బీసీ రిజర్వేషన్‌లపై ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదు : బీఆర్ఎస్

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాజకీయ లబ్ధి కోసమే బీసీలను బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు వాడుకుంటూన్నాయని, రిజర్వేషన్‌లపై రెండు పార్టీలకు చిత్తశుద్ధి లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న మండిపడ్డారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని బీసీ రిజర్వేషన్‌లపై కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీలు ద్వంద్వ వైఖరిని అవలంబిస్తున్నాయన్నారు. బీసీ బంద్‌కు మద్దతు తెలుపుతున్నామని, బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు.

డీసీసీ కోసం అభిప్రాయ సేకరణ

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): డీసీసీల నియామక ప్రక్రియలో భాగంగా ఏఐసీసీ పరిశీలకుడు అజయ్ సింగ్ జిల్లాలో పర్యటిస్తున్నారు. శుక్రవారం పట్టణంలోని గాయత్రి గార్డెన్‌లో మరో మారు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో భేటీ అయ్యారు. డీసీసీ నియామకం గురించి మాట్లాడిన అనంతరం ఒక్కొక్కరి అభిప్రాయాలు తీసుకున్నారు. అధ్యక్ష పదవి కోసం వచ్చిన దరఖాస్తులతో పాటు పార్టీ శ్రేణుల అభిప్రాయలను అధిష్ఠానానికి అందచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంట చేతికొచ్చినా.. పరేషానే!



● పత్తిని ఏరుతున్న రైతు కూలీలు

- గ్రామాల్లో తీవ్రమైన కూలీల కొరత
- పొరుగు రాష్ట్రానికి పరుగులు తీస్తున్న రైతులు
- రవాణా చార్జీలు, అడ్వాన్సుల చెల్లింపులతో ఆర్థిక భారం
- రెట్టింపవుతున్న పెట్టుబడి ఖర్చులతో అన్నదాతల ఆందోళన

చేతికొచ్చిన పంటలను.. ఇంటికి చేర్చేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. పంటలు చేతికొచ్చినా.. రైతులకు పరేషాన్ తప్పడం లేదు. అష్టకష్టాలు పడి మరీ పంటలను పండిస్తే కూలీలు దొరక్క పోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో ప్రధానంగా సాగయ్యే పత్తి, సోయా పంటల సీజన్ ఏకకాలంలోనే ప్రారంభం కావడంతో కూలీల కొరత తీవ్రమవుతోంది. ఈసారి పత్తి పంట సాగు 4లక్షల 31వేల ఎకరాలు కాగా, సోయా పంట 82వేల ఎకరాలలో సాగైనట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. వాణిజ్య పంటగా చెప్పుకునే పత్తి పంటపై జిల్లా రైతులు భారీ ఆశలు పెట్టుకుంటున్నారు.

ఆదిలాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షాలు కొంత తగ్గుముఖం పట్టడంతో పత్తి ఏరే పనులతో పాటు సోయా కోతలు, నూర్పిడి పనులు ఊపందుకుంటున్నాయి. కూలీల కొరత తో చిన్నపెద్ద అనే తేడా లేకుండా కుటుంబమంతా పంట చేన్లలోనే బిజీ బిజీగా గడుపుతున్నా రు. సకాలంలో పత్తిని ఏరకుంటే నలుపు భారీపోయి నాణ్యత దెబ్బతింటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే శీతాకాలం ప్రారంభం కావడంతో రాత్రి వేళల్లో విపరీతంగా కురుస్తున్న మంచుతో పంట దెబ్బతినే అవకా శం ఉందని రైతులు వాపోతున్నారు. అంతేకాకుండా ఈనెల 22 నుంచి పత్తి పంటను కొనుగోలు చేసే అవకాశం ఉండడంతో అన్నదాతల్లో మరింత హడావుడి కనిపిస్తోంది.



ఇంటికి చేర్చిన పత్తి పంట

ముందే అడ్వాన్సులు..

జిల్లాలో అత్యధికంగా సాగయ్యే పత్తి పంట ను ఏరేందుకు రైతులు కూలీలకు ముందే అడ్వాన్సులను చెల్లిస్తున్నారు. ఒక్కో కుటుంబానికి రూ.10వేల నుంచి రూ.20వేల వరకు అడ్వాన్సులు చెల్లిస్తేనే పనికి వచ్చేందుకు కూలీలు ఒప్పుకుంటున్నారు. స్థానికంగా కూలీలు దొరక్క పోవడంతో పొరుగు రాష్ట్రం పైనే ఆధారపడాల్సి వస్తుందంటున్నారు. అడ్వాన్సులు చెల్లించిన సమయానికి కూలీలు వస్తారో? రారోనన్న అనుమానలు వ్యక్తమవుతున్నాయి. మహారాష్ట్రలోని వందల కి.మీ.ల దూరం వెళ్లి మరీ కూలీల కు అడ్వాన్సులు చెల్లిస్తున్నారు. అలాగే కూలీల రానుపోను రవాణా చార్జీలను రైతులే భరిస్తున్నారు. ఎన్నో ఇబ్బందులకు ఓర్చుకొని పంటల ను సాగు చేసినా.. పంట

జిల్లాకు తరలి వస్తున్న కూలీలు

కూలీల కోసం రైతులు జిల్లా సరిహద్దుల్లో ఉన్న మహారాష్ట్ర బాట పడుతున్నారు. సరిహద్దు గ్రామాలైన కిన్వట్ తాలుకా మాండ్వి, మాండ, బెల్లూరు, కోటారి, బోడిడి, పిప్పల్‌గావ్, సాంగిడి, ఉద్గీర్ గ్రామాలతో పాటు ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుంచి పట్టణ కూలీలు పల్లెలకు పరుగులు తీస్తున్నారు. కిలో పత్తిని ఏరేందుకు రూ.7 నుంచి రూ.10 వరకు చెల్లిస్తూ అదనంగా ఆటో చార్జీలను ఇస్తున్నారు. సమయానికి కూలీలు దొరక్క పోవడంతో గత్యంతరం లేకనే మహారాష్ట్ర కూలీలపై ఆధారపడాల్సి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. కూలీలకు అవసరమైన ఏర్పాట్లు, భోజన వసతిని కల్పిస్తున్నారు. దీంతో మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల నంచి నిత్యం వందలాది మంది కూలీలు జిల్లాకు తరలివస్తున్నారు.

(తరువాయి 6వ పేజీలో....)

కేసీఆర్ స్ఫూర్తితో గ్రీన్ ఇండియా చాలెంజ్

● మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్‌కుమార్



మొలలగుట్టలో మొక్కలను నాటుతున్న జోగినిపల్లి సంతోష్

ఆదిలాబాద్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్ఫూర్తితోనే గ్రీన్‌ఇండియా చాలెంజ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినిపెల్లి సంతోష్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా రూరల్ మండలంలోని ఖండాల గ్రామ సమీపంలోని మొలలగుట్ట గ్రామంలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన వెదురు మొక్కల సాగు క్షేత్రాన్ని ప్రారంభించారు. మాజీ మంత్రి జోగు రామన్నతో కలిసి వెదురు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీఒక్కరు గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ కులవృత్తులను ప్రోత్సహించేందుకు వెదురు సాగును చేపట్టడం జరిగిందన్నారు. గిరిజన రైతులు వెదురును సాగు చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. వెదురుతో తయారు చేసే వివిధ కళాఖండాలు ఆదివాసీ గిరిజనుల ఆర్థికాభివృద్ధికి ఎంతో తోడ్పాటును ఇస్తాయన్నారు. మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ జడ్పీచైర్మన్ జనార్ధన్‌రాథోడ్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

● ప్రతీ పల్లెకు ముక్రా(కె) హరిత సంకల్పం ఆదర్శం

ఇచ్చోడ: గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా ముక్రా(కె) గ్రామంలో నాటిన లక్షపై చిలుకు మొక్కలు వందశాతం బ్రతకడం అద్భుతమని, ప్రతి మొక్కకు డిజిటల్ ట్రీ ఆధార్ ఇచ్చిన తొలిగ్రామం ముక్రా(కె) అని మాజీ రాజ్యసభసభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాను సందర్శించిన సంతోష్‌కుమార్‌ను ముక్రా(కె) మాజీ సర్పంచి గాడ్గె మీనాక్షి, మాజీ ఎంపీటీసీ గాడ్గె సుభాష్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

డ్రైవింగ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలి

నార్నూర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంత నిరుద్యోగ యువత కోసం ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళాను ఏర్పాటు చేసినట్లు నార్నూర్ ఎస్సై కె.అఖిల్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్సాహవంతులు తమ ఆధార్ కార్డు, 10వ తరగతి మెమో, ఇతర ధ్రువ పత్రాలను పోలీస్ స్టేషన్‌లో 18 తేదీ వరకు సమర్పించాలని ఆయన తెలిపారు.

పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన

నేరడిగొండ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన పెంచడమే స్వచ్ఛత పక్షోత్సవాల లక్ష్యమని ప్రధానోపాధ్యాయురాలు రాథోడ్ సునీత అన్నారు. శుక్రవారం మండలంలోని బుగ్గరాం ప్రాథమికోన్నత పాఠశాలలో స్వచ్ఛత పక్వాడా కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల రోజు వారి విద్యాబోధనకు ఆటంకం జరుగకుండా షెడ్యూల్లో సూచించిన రోజువారీ కార్యక్రమాల్ని నిర్వహించి, విద్యార్థులకు వివిధ అంశాల్లో ప్రతిభా పాటల పోటీలు నిర్వహించాలని పేర్కొన్నారు. అలాగే, ప్రతీ పాఠశాల స్వచ్ఛత పక్వాడ కార్యక్రమాలపై విద్యార్థులతో పాటు వారివారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని కోరారు. పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులచే స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఇందులో పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంగ్లం విద్యార్థులకు అత్యవసరం

● కలెక్టర్ రాజర్షి షా ● ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఇంగ్లీష్ లర్నింగ్ ప్రోగ్రామ్ అమలు తీరు పరిశీలన ● నార్నూర్‌లో కలెక్టర్ సుగిగాలి పర్యటన



నార్నూర్‌లోని ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

నార్నూర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఆంగ్ల భాష ఇప్పుడు ప్రతీ విద్యార్థికి అత్యవసరమని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అస్పిరేషనల్ బ్లాక్ పరిధిలో అమలవుతున్న ఇంగ్లీష్ ఫౌండేషన్ లర్నింగ్ ప్రోగ్రామ్ అమలు తీరును కలెక్టర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించారు. వారు నేర్చుకుంటున్న ఇంగ్లీష్ పాఠాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు స్టోరీస్, పోయెమ్స్, టూ లెటర్ వర్డ్స్, త్రీ లెటర్ వర్డ్స్, ఫోర్ లెటర్ వర్డ్స్ వంటి పదాలు చదవడం, రాయడం ప్రదర్శించారు. ఈ కార్యక్రమం వలన తాము ఇంగ్లీష్ నేర్చుకోవడంలో మంచి అభివృద్ధి సాధిస్తున్నామని విద్యార్థులు తెలిపారు. విద్యార్థులు ప్రతీరోజు క్రమశిక్షణతో చదవడం, రాయడం అలవాటు చేసుకోవాలన్నారు. ఇంగ్లీష్ నేర్చుకోవడం ద్వారా భవిష్యత్తులో అనేక అవకాశాలు లభిస్తాయని విద్యార్థులను ప్రోత్సహించారు. ఇందులో ఎంఈవో అనిత, కమ్యూనిటి మొబిలైజింగ్ ఆఫీసర్ తిరుపతి, తదితరులున్నారు.



టెలీ మెడిసిన్ పనితీరును పరిశీలిస్తూ..

'టెలీ మెడిసిన్' అమలుతీరు పరిశీలన

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేయడంలో టెలీ మెడిసిన్ సదుపాయం కీలక పాత్ర పోషిస్తోందని కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో టెలీ మెడిసిన్ అమలు తీరును కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ పెద్దనగరాలకు వెళ్లకుండానే రోగులు స్థానిక ఆరోగ్య కేంద్రాల ద్వారానే నిపుణుల వైద్య సలహా, చికిత్స పొందే అవకాశం కలుగుతోందని తెలిపారు. అనంతరం మండల పరిధిలోని 25 మంది టీబీ రోగులకు ఆరు నెలలపాటు ఆహార బాస్కెట్లు అందజేయడానికి శ్వశోధన్ ట్రస్ట్ ముందుకు వచ్చింది. సామాజిక సేవలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినందుకు కలెక్టర్ ట్రస్ట్ ప్రతినిధులను అభినందించారు. ఇందులో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్, స్థానిక వైద్యులు రాంబాబు, జితేందర్ రెడ్డి, సంస్థ ప్రతినిధులు జాదవ్ సుదర్శన్, తదితరులున్నారు.



కలెక్టర్‌ను సన్మానిస్తున్న బాంబు క్రాఫ్ట్ మహిళలు

బాంబు క్రాఫ్ట్‌తో మహిళలకు ప్రోత్సాహం

మండలంలోని బాంబు క్రాఫ్ట్ యూనిట్‌ను శుక్రవారం కలెక్టర్ సందర్శించారు. యూనిట్‌లో ఏర్పాటు చేసిన వివిధ మిషనరీల పని తీరును, అక్కడ తయారవుతున్న బాంబు ఉత్పత్తుల నమూనాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ యూనిట్‌లో 20 మంది మహిళలకు 10 రోజులపాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. మరింత నాణ్యతతో ఉత్పత్తులు తయారు చేసి, ఆదిలాబాద్, హైదరాబాద్ ఇతర పట్టణాల్లో మార్కెట్‌ను విస్తరించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జాడి రాజలింగు, ఎంపీడీవో గంగాసింగ్, పీఆర్ ఏఈ జాడి లింగన్న, ఏపీఎం రాజారం, సెర్ప్ సిబ్బంది, మహిళలు దుర్గే రుబాయి, జిల్లపెల్లి. ఉషారాణి, పద్మబాయి, మీనాబాయి, సేవంత బాయి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులపై సమీక్ష

మండలంలోని గుండాల గ్రామాన్ని శుక్రవారం కలెక్టర్ సందర్శించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంటి నిర్మాణ దశను ప్రత్యక్షంగా పరిశీలించి, కూలీలు, లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడారు. ఇళ్ల నిర్మాణం నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతీ కుటుంబానికి ప్రభుత్వం కల్పిస్తున్న గృహాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందులో గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీందర్, తహసీల్దార్ జాడి రాజాలింగు, ఎంపీడీవో గంగాసింగ్, హౌసింగ్ ఏఈ దుర్గం శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ సంప్రదాయాలు గర్వకారణం

మండలంలోని గుండాల గ్రామంలో కలెక్టర్ రాజర్షి షా గ్రామస్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మన ఆదివాసీ సంస్కృతీ, సంప్రదాయాలు మనకు గర్వకారణమన్నారు. డీఆర్‌డీవో ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీందర్, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అలాగే, 'మన ఊరు-మన బడి' బిల్లు ఇప్పటి వరకు విడుదల కాలేదని మాజీ సర్పంచ్ బిగజానంద్ నాయక్, తాడిహత్నూర్ గ్రామస్థులు కలెక్టర్‌కు విన్నవించారు.



సీపీఆర్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

మెరుగైన జీవన శైలితో ఆరోగ్యం

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఆపత్కాలంలో బాధితుల ప్రాణాపాయం కాపాడే సీపీఆర్ ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. సీపీఆర్‌పై కొనసాగుతున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం స్థానిక అంబేద్కర్ చౌక్‌లోని దుకాణ సముదాయాలలో వ్యాపారస్తులు, వినియోగదారులకు ప్రయోగత్మకంగా సీపీఆర్ గురించి వివరించారు. రిమ్స్ డైరెక్టర్‌తో పాటు పలువురు వైద్యులు పాల్గొని సీపీఆర్ ప్రక్రియ అర్థమయ్యేలా వివరించారు. రిమ్స్ డైరెక్టర్ మాట్లాడుతూ ఇటీవల గుండెపోటు మరణాలు పెరుగుతున్న నేపథ్యంలో సీపీఆర్ గురించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు దినేష్ మాటోలియా తో పాటు పలువురు దుకాణాదారులు పాల్గొన్నారు.

బీసీ బంద్‌కు వివిధ సంఘాల మద్దతు

● రిజర్వేషన్‌లు సాధించేంత వరకు పోరాడతామని నేతల స్పష్టీకరణ

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ల సాధనే లక్ష్యంగా ఈనెల 18న చేపడుతున్న రాష్ట్ర వ్యాప్త బంద్‌కు వివిధ సంఘాలు సంపూర్ణ మద్దతు తెలిపాయి. శుక్రవారం పలు సంఘాల నేతృత్వంలో మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి తమ మద్దతును ప్రకటించాయి. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్‌తో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర బంద్ కు ప్రతి ఒక్కరు సహకరించాలని పిలుపునిచ్చారు. రిజర్వేషన్‌లు సాధించేంత వరకు పోరాటం ఆపే ప్రసక్తే లేదన్నారు. మరోవైపు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం నేతలు పాల్గొని తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అటు సీపీఎం పార్టీ సైతం బంద్ కు మద్దతు పలుకుతుందని, బీసీ రిజర్వేషన్లకు బీజేపీనే అడ్డు పడుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ ఆరోపించారు. బీసీ జేఏసీలో బీజేపీ ఉన్నందున పార్టీ తరఫున స్వతంత్ర నిరసనలు తెలుపుతామని స్థానికంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. అలాగే పద్మశాలి సంఘం అధ్యక్షురాలు మంచేకట్ల ఆశమ్మ బంద్‌కు

(మరిన్ని వివరాలు 6వ పేజీలో....)

పీఎం జన్‌మన్‌తో పీవీటీజీల అభివృద్ధి

● ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా



కోలాంగూడాలో సూరు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఈశ్వరీ బాయి

ఉట్నూర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గిరిజనుల హక్కుల రక్షణ కోసం కృషి చేసిన గిరిజన వీరులు కొమురంభీం, కుంరం సూరు ఆశయాల సాధన కోసం కృషి చేస్తున్నామని, కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ప్రధానమంత్రి జన్‌మన్ కార్యక్రమాల ద్వారా అభివృద్ధి, సంక్షేమానికి చర్యలు చేపడుతున్నామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. శుక్రవారం మండలంలోని దంతన్‌పల్లి సమీపంలోని కోలాంగూడాలో కుంరం సూరు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పీవో మాట్లాడుతూ కోలాం గిరిజనులలో పౌష్టిక ఆహార లోపం నివారణ కోసం కృషి చేస్తున్నామన్నారు. ఇందులో రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరి బాయి, పీవీటీజీ ఇన్‌చార్జీ అధికారి దామోదర స్వామి, మేనేజర్ శ్యామల, కోలాం సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొడప సోనేరావు, కుంరంసూరు యువ సేన సభ్యులు, తదితరులున్నారు.